జీఎస్టీ వసూళ్లు తగ్గాయ్..

డిసెంబర్‌లో రూ.1.65 లక్షల కోట్లు
మూడు నెలల కనిష్ఠానికి పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జనవరి 1: కొద్ది కాలంగా ప్రతీ నెలా పెరుగుతూ వస్తున్న జీఎస్టీ వసూళ్లు డిసెంబర్ నెలలో హఠాత్తుగా తగ్గాయి. ఈ నెలలో వస్తు, సేవల పన్నుల వసూళ్లు మూడు నెలల కనిష్ఠస్థాయి 1.65 లక్షల కోట్లకు పడిపోయాయి. 2022 డిసెంబర్‌తో పోలిస్తే 2023 డిసెంబర్‌లో వసూళ్లు 10 శాతం పెరిగినప్పటికీ, అక్టోబర్, నవంబర్ నెలలతో పోలిస్తే క్షీణించినట్టు సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023 అక్టోబర్‌లో రూ.1.72 లక్షల కోట్లు, నవంబర్‌లో రూ.1.68 లక్షల కోట్ల పన్నులు వసూలయ్యాయి. 2022 డిసెంబర్‌లో ఈ వసూళ్లు రూ.1.50 లక్షల కోట్లు. 2023 డిసెంబర్‌లో వసూలైన రూ.1.65 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.30,443 కోట్లు, స్టేట్ జీఎస్టీ రూ.37,935 కోట్లు, ఇంటర్నేషనల్ జీఎస్టీ రూ.84,255 కోట్లు (వస్తూత్పత్తుల దిగుమతుల ద్వారా వచ్చిన రూ.41,534 కోట్లతో కలుపుకుని) సమకూరాయి. రూ.11,249 కోట్లు సెస్‌ల రూపంలో వసూలయ్యింది. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ జీఎస్టీ వసూళ్లు 12 శాతం వృద్ధితో రూ.14.97 లక్షల కోట్లకు చేరినట్టు ఆర్థిక శాఖ తెలిపింది. ఈ తొమ్మిది నెలల కాలంలో నెలవారీ సగటు వసూళ్లు రూ.1.66 లక్షల కోట్లు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.1.49 లక్షల కోట్ల సగటు వసూళ్లతో పోలిస్తే 12 శాతం వృద్ధి చెందాయి.

ఎల్ఐసీకి రూ.806 కోట్ల జీఎస్టీ నోటీసు

ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కు దాదాపు రూ.806 కోట్ల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) డిమాండ్ నోటీసు అందింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను జీఎస్టీ చెల్లింపులు తక్కువగా చేశారంటూ సంబంధిత పన్ను అధికారుల నుంచి ఈ నోటీసు వచ్చినట్టు సోమవారం ఎల్ఐసీ తెలియజేసింది. జీఎస్టీ బకాయి, దాని వడ్డీ, జరిమానా అన్నీ కట్టాలని సదరు నోటీసులో ట్యాక్స్ అథారిటీస్ పేర్కొన్నట్టు రెగ్యులేటరీలకు ఎల్ఐసీ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కాగా, ఈ ఆదేశాలపై నిర్దేశిత వ్యవధిలోగా అప్పీల్స్ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని సంస్థ చెప్తున్నది. తాజా నోటీసులతో సంస్థ ఆర్థిక కార్యకలాపాలపై లేదా ఇతరత్రా కార్యకలాపాలపై ఏ రకమైన ప్రభావం ఉండబోదని ఎల్ఐసీ వెల్లడించింది.

తెలంగాణలో వసూళ్లు రూ.4,753 కోట్లు

తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్‌లో తగ్గాయి. అయితే 2022 డిసెంబర్ వసూళ్లకంటే 14 శాతం పెరిగాయి. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో రూ.4,753 కోట్ల పన్నులు వసూలయ్యాయి. ఇదే ఏడాది నవంబర్‌లో వసూళ్లు రూ.4,986 కోట్లు కాగా, 2022 డిసెంబర్‌లో ఇవి రూ.4,178 కోట్లుగా ఉన్నాయి.

ఎయిర్‌పోర్టులో తనిఖీలు సులభతరం

సెల్ఫ్ కియోస్క్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ వ్యవస్థ ఏర్పాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ): నూతన టెక్నాలజీని ప్రవేశపెట్టడంలో ఎల్లప్పుడూ ముందుండే జీఎమ్మార్ అంతర్జాతీయ విమానాశ్రయం మరో ముందడుగు వేసింది. తనిఖీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా సెల్ఫ్ చెక్ కియోస్క్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయాణికులు టర్మినల్లోకి ప్రవేశించడానికి ముందే తనిఖీలు చేయడం, బ్యాగేజీ చెక్ ఇన్, బోర్డింగ్ పాస్‌ల జారీ వరకు అన్ని సదుపాయాలను ఒకేచోట అందిస్తున్నట్టు జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్ ఈడీ ఎస్‌జీకే కిశోర్ అన్నారు. విమానాశ్రయంలో ఆధునిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా ఈ నూతన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు, దీంతో టర్మినల్ వద్ద రద్దీ తగ్గడంతోపాటు ప్రయాణికులు మరింత సులభంగా రాకపోకలు సాగించవచ్చునని చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసిన కియోస్క్‌ల వద్ద ప్రయాణికులు వారి బ్యాగ్‌లను వారే చెక్ చేసుకోవచ్చును. ఇక్కడే బోర్డింగ్ పాస్, బ్యాగ్ ట్యాగ్‌లను తీసుకొని వారి బ్యాగేజీలకు ట్యాగ్ చేసుకుంటే సరిపోతుంది. ఈ సేవలు విమానం ప్రారంభానికి గంట ముందు వరకు పొందవచ్చునని, ఆ తర్వాత నిలిపివేయనున్నట్లు తెలిపారు.

UltraTech CEMENT
The Engineer's Choice

అల్ట్రాటెక్‌కు జీఎస్టీ షాక్

న్యూఢిల్లీ, జనవరి 1: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన సిమెంట్ తయారీ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్‌కు జీఎస్టీ ఆథార్టీ గట్టి షాకిచ్చింది. రూ.72.06 లక్షల జీఎస్టీ చెల్లించాలని ఆదేశించింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ క్రెడిట్‌కు సంబంధించి జరిమానాతోపాటు వడ్డీ కలుపుకొని రూ.25.11 లక్షలు. ఈ జీఎస్టీ డిమాండ్ నోటీసుపై అప్పిలేట్ ఆథార్టీకి వెళ్లనున్నట్లు ప్రకటించింది.

8.18 కోట్ల మంది ఐటీఆర్ ఫైలింగ్

న్యూఢిల్లీ, జనవరి 1: రికార్డు స్థాయిలో ఆదాయ పన్ను దాఖలు చేశారు. డిసెంబర్ 31తో ముగిసేనాటికి 2023-24 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 8.18 కోట్ల మంది ఐటీ రిటర్నులు దాఖలు చేసినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. అంతక్రితం ఏడాది దాఖలు చేసిన 7.51 కోట్ల కంటే 9 శాతం చొప్పున పెరిగారని పేర్కొంది.

టై హైదరాబాద్ ప్రెసిడెంట్ శ్రీని చందుపట్ల

హైదరాబాద్, జనవరి 1: ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్(టై) హైదరాబాద్ నూతన ప్రెసిడెంట్‌గా శ్రీని చందుపట్ల నియమితులయ్యారు. ఆయన 25వ ప్రెసిడెంట్ కావడం విశేషం. ప్రాంతీయ సంస్థలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే ఉద్దేశంలో భాగంగా ఏర్పాటైన ఈ టై హైదరాబాద్..మెంటరింగ్, నెట్‌వర్కింగ్, ఫండింగ్, ఇంక్యూబేషన్ సేవలు అందిస్తున్నది. మంజీరా డిజిటల్ సిస్టమ్స్ కో-ఫౌండర్ శ్రీని..స్టార్టప్ టెక్నాలజీ బిజినెస్‌లో 20 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. అంతర్జాతీయంగా లాభాపేక్ష లేని ఈ ఎంటర్‌ప్రెన్యూర్ 1992లో సిలికాన్ వ్యాలీ వేదికగా ప్రారంభమైంది. అలాగే పగడాల కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజేశ్..టై హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు.

డిపాజిట్లు తీసుకోని కస్టమర్ల కోసం అన్వేషణ

బ్యాంక్‌లకు ఆర్బీఐ మార్గదర్శకాలు

ముంబై, జనవరి 1: డిపాజిట్లను క్లెయిం చేయని కస్టమర్లను అన్వేషించేందుకు ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలంటూ బ్యాంక్‌లను రిజర్వ్‌బ్యాంక్ ఆదేశించింది. ఇందుకు సంబంధించి ఆర్బీఐ తాజాగా సమగ్ర మార్గదర్శకాలు జారీచేసింది. బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన క్లెయిం కాని డిపాజిట్ల పరిమాణాన్ని తగ్గించడం, అవి చట్టబద్ధంగా చెందిన కస్టమర్లకు అప్పగించడం లక్ష్యంగా జారీఅయిన ఈ మార్గదర్శకాలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయి. ఆర్బీఐ ఆదేశాల ప్రకారం బ్యాంక్‌లు నిర్వహణలో లేని ఖాతాలను, క్లెయింకాని డిపాజిట్లను వర్గీకరించడం, వీటికి ఒక నోటిఫికేషన్ జారీచేయాల్సి ఉంటుంది. అటువంటి ఖాతాలు/డిపాజిట్లలో మోసాలు జరగకుండా బ్యాంక్‌లు వాటిని తరచూ సమీక్షించాలి.

ఈమెయిళ్లు, ఎస్ఎంఎస్‌లు పంపాలి

రెండేండ్లపాటు ఖాతాదారు జరిపిన లావాదేవీలేవీ లేకపోతే ఆ సేవింగ్స్/కరెంటు ఖాతాలను ఇన్‌ఆపరేటివ్‌గా పరిగణిస్తారు. పదేండ్లు, అంతకుమించి నిర్వహణలో లేని ఖాతాల్లో ఉన్న నగదు క్లెయింకాకుండా ఉంటే, దానిని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్ స్కీమ్‌కు బదిలీ చేస్తారు. తాజా మార్గదర్శకాలను అనుసరించి ఇన్‌ఆపరేటింగ్ ఖాతాలు/అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను చెందిన కస్టమర్లను అన్వేషించడంలో భాగంగా బ్యాంక్‌లు ఆయా ఖాతాదారును లేఖలు, ఈ మెయిళ్లు, ఎస్ఎంఎస్‌ల ద్వారా కాంట్రాక్టు చేయాల్సి ఉంటుంది. వీటిని ప్రతీ మూడు నెలలకోమారు పంపించాలి. ఖాతాదారు ఎక్కడ ఉన్నడో కనుక్కోలేకపోతే..ఖాతాను ప్రారంభించే సమయంలో ఆ ఖాతాదారును బ్యాంక్‌కు పరిచయంవారిని బ్యాంక్ కాంట్రాక్టు చేయాలి. ఆ ఖాతాలో నామినీ రిజిష్టరై ఉంటే వారిని సైతం ఖాతాదారు ఆచూకీ కోసం బ్యాంక్‌లు కాంట్రాక్టు చేయాల్సి ఉంటుంది. నిర్వహణలో లేని ఖాతాలు/క్లెయింకాని డిపాజిట్లకు చెందిన కస్టమర్లు, వాటి నామినీలు, చట్టబద్ధ వారసులు ఎక్కడ ఉన్నారో అన్వేషించడానికి బ్యాంక్‌లు తరచూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలి.

బెంగళూరులో కెనరా బ్యాంక్ డాటా, అనలిటిక్స్ సెంటర్

బెంగళూరు, జనవరి 1: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ కెనరా బ్యాంక్ సోమవారం బెంగళూరులో తమ నూతన డాటా అండ్ అనలిటిక్స్ సెంటర్‌ను ప్రారంభించింది. సంస్థ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు దీన్ని ఆవిష్కరించారు. ఇన్నోవేషన్, కొలాబరేషన్‌కు మద్దతిచ్చేలా స్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ సదుపాయాలతో నిండిన ఈ సెంటర్‌ను ఎక్స్‌లెన్స్ హబ్‌గా మార్చాలని బ్యాంక్ చూస్తున్నది. ఈ సందర్భంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) రాకతో మానవుల జీవితాలు ఊహించని విధంగా మారిపోయాయన్న సీఈవో.. ఏఐ నైతిక వినియోగం కోసం యావత్తు ప్రపంచం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. అలాగే క్లౌడ్ టెక్నాలజీలో డాటా లేక్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ వేదికల ఏర్పాటు కోసం భాగస్వామ్యాలకూ సిద్ధమన్నారు.

డెకాయ్‌థాన్ ఫినాలే

కొత్త సంవత్సరం ఆరంభం సందర్భంగా సోమవారం డెకాయ్‌థాన్ (డాటా అనలిటిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హ్యాకథాన్) గ్రాండ్ ఫినాలేనూ బ్యాంక్ నిర్వహించింది. బ్యాంకింగ్ సేవలపై ఖాతాదారుల అనుభవం, మోసాల నిరోధం, దివాలా అంచనా వంటి అంశాలపై దేశవ్యాప్తంగా ఔత్సాహికులు ఇందులో పాల్గొని తమ ఆలోచనల్ని పంచుకున్నారు. విజేతలకు ఆకర్షణీయ నగదు ప్రోత్సాహకాలను బ్యాంక్ అందించింది. గత ఏడాది అక్టోబర్ 20 నుంచి నవంబర్ 5 వరకు జరిగిన డెకాయ్‌థాన్‌లో 2,899 మంది పాల్గొన్నారు. వీరిలో కొత్త ఆలోచనల్ని చూపిన 256 మంది తదుపరి దశకు చేరుకున్నారు. ఈ క్రమంలోనే నవంబర్ 13 నుంచి 30 వరకు, డిసెంబర్ 5 నుంచి 11 వరకు తర్వాతి స్థాయి పోటీలు జరిగాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఐదుగురు పాల్గొని వారి ఆలోచనల్ని ఆవిష్కరించినట్టు బ్యాంక్ తెలియజేసింది.

నయా కార్లు

న్యూఢిల్లీ, జనవరి 1: నూతన సంవత్సరంలో నయా కార్లను విడుదల చేయడానికి వాహన ఉత్పత్తి సంస్థలు రెడీ అవుతున్నాయి. పాత సంవత్సరంలో అమ్మకాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్న సంస్థలు నయా సాల్‌పై గంపెడు ఆశ పెట్టుకుంటున్నాయి. దీంట్లో భాగంగా ఈ ఏడాది తొలి నెల జనవరిలో నాలుగు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమయ్యాయి మూడు సంస్థలు. వీటిలో స్పోర్ట్ యుటిలిటీ వాహనాలతోపాటు ఈవీ, లగ్జరీ కార్లను విడుదల చేయబోతున్నాయి మహీంద్రా, కియా, బెంజ్ సంస్థలు.

నూతన మెర్సిడెజ్-బెంజ్ జీఎల్ఎస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్ ఈ నెల 8న దేశీయ మార్కెట్లోకి నూతన జీఎల్ఎస్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఏప్రిల్ 2023లోనే అంతర్జాతీయ మార్కెట్లోకి విడుదల చేసిన ఈ మాడల్‌ను ఎనిమిది నెలల తర్వాత భారత్‌లో ప్రవేశపెడుతున్నది. ఈ కారు ధర కోటి రూపాయల స్థాయిలో ఉంటుందని అంచనా. 3.0 లీటర్ల పెట్రోల్ లేదా 3 లీటర్ల డీజిల్ ఇంజిన్‌తో ఈ మాడల్‌ను తీర్చిదిద్దింది.

మహీంద్రా ఎక్స్‌యూవీ 400

మహీంద్రా అండ్ మహీంద్రా నయా ఎలక్ట్రిక్ వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. డ్యూయల్ 10.25 అంగుళాల స్క్రీన్ కలిగిన ఈ మాడల్ లోపలి భాగాన్ని నూతనంగా తీర్చిదిద్దింది. టాటా మోటర్స్‌కు చెందిన నెక్సాన్ ఈవీకి పోటీగా ఈ మాడల్‌ను ప్రవేశపెడుతున్నది.

కియా సోనెట్

సరికొత్త సోనెట్ మాడల్‌ను ఈ నెలలోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది కొరియాకు చెందిన ఆటోమొబైల్ సంస్థ కియా. గతంలో విడుదల చేసినదానికంటే భిన్నంగా తీర్చిదిద్దిన ఈ మాడల్‌ను టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసింది. ఈ మాడల్‌కు ముందస్తు బుకింగ్‌లు ఆరంభించిన సంస్థ..ధర, ఇతర వివరాలను ఈ నెలలోనే ప్రకటించబోతున్నది.

లాభాలతో ఆరంభం

2024 తొలిరోజు పెరిగిన మార్కెట్లు

ముంబై, జనవరి 1: దేశీయ స్టాక్ మార్కెట్లు 2024 సంవత్సరాన్ని లాభాలతో ప్రారంభించాయి. తీవ్ర ఊగిసలాట మధ్యలో కదలాడిన సూచీలు చివర్లో స్వల్పంగా కోలుకున్నాయి. ఇంట్రాడేలో 72,561.91 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 72,271.94 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో సూచీ 31.68 పాయింట్లు లాభపడినట్టు అయింది. ఇంట్రాడేలో రికార్డు స్థాయికి చేరుకున్న నిఫ్టీ 10.50 పాయింట్లు అందుకొని 21,741.90 వద్ద నిలిచింది. 28 నిఫ్టీ షేర్లలో 22 షేర్లు కిందకు పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో సూచీలు భారీగా పతనమయ్యాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. మార్కెట్లో అత్యధికంగా నెస్లె, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటర్స్, విప్రో, ఐటీసీల షేర్లు లాభాల్లో ముగియగా..భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హిందుస్థాన్ యునిలీవర్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఎనర్జీ, టెలికమ్యూనికేషన్, సేవలు, కమోడిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్, ఇండస్ట్రియల్స్ రంగ సూచీలు కదం తొక్కగా..ఆటో, బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరబుల్ సూచీలు నష్టపోయాయి. 2023లో బీఎస్ఈ సెన్సెక్స్ 11,399.52 పాయింట్లు లేదా 18.73 శాతం, నిఫ్టీ 3,626.1 పాయింట్లు లేదా 20 శాతం చొప్పున పెరిగాయి.

ఆటో రంగానికి పీఎల్ఐ స్కీమ్ పొడిగింపు

న్యూఢిల్లీ, జనవరి 1: ఆటోమొబైల్, ఆటో విడిభాగాలకు ఉద్దేశించిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) స్కీము కాలపరిమితిని ఒక ఏడాది పొడిగిస్తున్నట్టు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. సాధికారిక కార్యదర్శుల కమిటీ ఆమోదం లభించిన నేపథ్యంలో ఈ స్కీము కాలపరిమితిని పాక్షిక సవరణలతో పొడిగిస్తున్నట్టు తెలిపింది. సవరించిన స్కీము ప్రకారం 2023-24 నుంచి వరుసగా ఐదు ఆర్థిక సంవత్సరాలు ఆటో రంగ సంస్థలకు ఉత్పత్తితో అనుసంధానించిన ప్రోత్సాహకం లభిస్తుంది. 2023-24లో పొందిన ప్రోత్సాహకం చెల్లింపు 2024-25లో జరుగుతుంది.

ఆఖర్లో స్పీడ్ తగ్గింది

డిసెంబర్‌లో మారుతి, హ్యుందాయ్ మినహా పర్వాలేదనిపించిన ఆటో సంస్థల అమ్మకాలు

న్యూఢిల్లీ, జనవరి 1: మారుతి సుజుకీ, హ్యుందాయ్ మినహా మిగతా ఆటో సంస్థల విక్రయాలు గత నెల పర్వాలేదనిపించాయి. డిసెంబర్‌లో మారుతి సుజుకీ దేశీయ అమ్మకాలు, అంతర్జాతీయ ఎగుమతులు కలిపి 1,37,551 యూనిట్లుగా ఉన్నాయి. నిరుడు డిసెంబర్‌లో ఇవి 1,39,347 యూనిట్లుగా నమోదవగా.. 1.28 శాతం తగ్గినట్టు తేలింది. ఆల్టో, ఎస్-ప్రెస్సో తదితర ప్రవేశ స్థాయి మినీ కార్లకు డిమాండ్ పడిపోయింది. బాలెనో, సెలీరియో, డిజైర్, ఇగ్నీస్, స్విఫ్ట్, టూర్ ఎస్, వాగనార్ మాడళ్లకూ ఆశించిన స్థాయిలో ఆదరణ లేదని సంస్థ పేర్కొన్నది. అయితే బ్రెజ్జా, ఎర్టిగా, ఫ్రాంక్స్, గ్రాండ్ విటారా, ఇన్విక్టో, జిమ్నీ, ఎస్-క్రాస్, ఎక్స్ఎల్6 కార్ల అమ్మకాలు పెరగడం విశేషం.

2023 మొత్తంగా..

గత ఏడాది మొత్తంగా ఆటో సంస్థల అమ్మకాలు ఆకట్టుకున్నాయి. దేశీయ మార్కెట్‌లో ప్యాసింజర్ వెహికిల్ సేల్స్ మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 41.08 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2022తో పోల్చితే 8.3 శాతం వృద్ధి కనిపించింది. నాడు 37.92 లక్షల యూనిట్లే అమ్ముడయ్యాయి. తయారీదారుల నుంచి డీలర్లకు చేరిన వాహనాల్లో దాదాపు సగం ఎస్‌యూవీలే ఉండటం గమనార్హం. ఇక 2023లో వాహన సగటు ధర రూ.11.5 లక్షలుగా ఉన్నట్టు తేలింది. 2022లో ఇది రూ.10.58 లక్షలు. కరోనాకు ముందు 2019-20లోనైతే రూ.8.2 లక్షలే. పెరిగిన ఉత్పాదక వ్యయమే ఇందుకు కారణమని పరిశ్రమ చెప్తున్నది. కాగా, గత ఏడాది దేశీయంగా మారుతి సుజుకీ వాహన విక్రయాలు తొలిసారి 20 లక్షల యూనిట్ల మైలురాయిని అధిగమించాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల వాటానే 7.76 లక్షల యూనిట్లుగా ఉండటం విశేషం. ఎగుమతులు 2,69,046 యూనిట్లుగా ఉన్నాయి. హ్యుందాయ్ నిరుడు దేశీయంగా, ఎగుమతులు కలిపి 7,65,786 వాహనాలను అమ్మింది. 2022తో చూస్తే 9 శాతం పెరిగాయి.

- **2023లో మారుతి, టాటా, హ్యుందాయ్, టొయోటా కంపెనీలు అత్యుత్తమ అమ్మకాలను చవిచూశాయి.**
- **గత ఏడాది దేశీయ ఆటో పరిశ్రమ విక్రయాలు తొలిసారి 40 లక్షల మార్కును దాటాయి.**
- **మార్కెట్‌లో నిరుడు 26 శాతం ఎగిసిన ఎస్‌యూవీల డిమాండ్.**
- **2023లో హ్యాచ్‌బ్యాక్, సెడాన్‌లకు తగ్గిన ఆదరణ. మల్టీ-యుటిలిటీ వాహనాల డిమాండ్ యథాతథం.**
- **టాటా మోటర్స్ గత ఏడాది 5.53 లక్షల వాహనాల్ని విక్రయించింది. ఎస్‌యూవీ, హచ్‌బ్యాక్ కార్లకు డిమాండ్.**
- **46 శాతం వృద్ధితో నిరుడు 2,33,346 యూనిట్లను అమ్మిన టొయోటా.**
- **నిరుడు 18 శాతం ఎగిసి 56,902 యూనిట్లకు చేరిన ఎంజీ సేల్స్.**

డిసెంబర్‌లో వాహన విక్రయాలు (యూనిట్లలో)

సంస్థ	2023	2022	వృద్ధి (%)
మారుతి సుజుకీ	1,37,551	1,39,347	-1.28
టాటా మోటర్స్	76,138	72,997	4
మహీంద్రా	60,188	-	6
హ్యుందాయ్	56,450	57,852	-2.5
టొయోటా	22,867	10,421	119
హోండా కార్స్	7,902	7,062	12
ఎంజీ మోటర్	4,400	-	13
వీఈసీవీ	8,026	7,221	11.1
బజాజ్ ఆటో	3,26,806	2,81,514	16
టీవీఎస్ మోటర్	3,01,898	2,42,012	25
రాయల్ ఎన్‌ఫీల్డ్	63,387	68,400	-7

2024కు నష్టాలతో స్వాగతం

ముంబై, జనవరి 1: నూతన సంవత్సరానికి రూపాయి నష్టాలతోనే స్వాగతం పలికింది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపీ మారకం విలువ సోమవారం మరో 5 పైసలు క్షీణించింది. ఉదయం ట్రేడింగ్ ఆరంభం నుంచే నేలచూపుల్ని చూసిన రూపాయి.. చివరిదాకా అదే తీరును కనబర్చింది. ఈ క్రమంలోనే 83.21 వద్ద ముగిసింది. దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతోనే సరిపెట్టడం, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం.. రూపీ వాల్యూని దిగజార్చిందంటూ ట్రేడింగ్ సరళిని ఫారెక్స్ ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. గత ఏడాదికి ట్రేడింగ్ చివరి రోజైన శుక్రవారం రూపాయి మారకం విలువ 4 పైసలు కోలుకుని 83.16 వద్ద స్థిరపడిన విషయం తెలిసిందే. అయితే సోమవారం ఆ లాభాలు కాస్తా ఆవిరైపోయాయి. భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) సోమవారం రూ.855.80 కోట్ల విలువైన షేర్లను అమ్మేసుకున్నారు. ఇది కూడా రూపీని ప్రభావితం చేసిందన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.